

# నిజం

—ప్రసన్న

మెయిల్ రావటానికింకా టైముంది.

ప్లాట్‌ఫారం మీద సందడి అంతకంతకూ పెరుగుతోంది. సామాన్లు లెక్క చూసుకొనేవాళ్ళూ, కూలీలతో డబ్బులు గురించి ఘర్షణ పడుతున్నవాళ్ళూ, బుక్‌స్టాల్సు దగ్గర కొత్త పుస్తకాలు తిరగేస్తున్నవాళ్ళూ - యిట్లా రకరకాల వాళ్ళతో నిండివుంది. ఆవకాయ దగ్గర నుంచి అంతర్జాతీయ సమస్యల వరకూ - ఇతివృత్తాలు మాటల్లో చోటు చేసుకుంటున్నాయి.

ప్రసాదరావు సిమెంటు బెంచీ మీదనుంచి లేచి బద్ధకంగా ఆవలించాడు.

ఆరేళ్ళ కుర్రాడు, పారేసిన అరటిపండు తొక్క గుజ్జును పళ్ళతో గీక్కుంటూ ప్రసాదరావు కేసి చూస్తున్నాడు.

'వీడికి నా ముఖంలో వింతేం కనుపించిదబ్బా?' అనుకొని నవ్వు కుంటూ తోపుడుబండి మీదనున్న అద్దంలోకి తొంగి చూసాడు.

గడ్డం పెరిగింది. పెరిగిన గెడ్డం తెల్లగా నవ్వుతూ వయసును బయట పెడుతోంది.

'నేనూ ముసలివాణ్ణయ్యాను' అనుకున్నాడు గెడ్డం తడుము కుంటూ.

తోపుడుబండి ముందుకెళ్ళింది.

ఎదురుగా వచ్చిన వ్యక్తిని చూసి తెల్లబోయాడు ప్రసాదరావు.

ఆశ్చర్యంతో మాట పెగల్లేదు.

ఇంచుమించుగా ఆ వ్యక్తి పరి స్థితి కూడా అలానే వుంది.

"శాంతీ!" అన్నాడు వినీ విని పించనట్లు.

ఆమె పెదవులు నవ్వుతూ విచ్చుకున్నాయి.

"ప్రసాద్! నువ్వా?"

అంతలో సామాను ట్రాలీ వచ్చింది.

"అలా ప్రక్కకు వెళదాం- పద."

రద్దీ లేనిచోట నిలబడ్డారు.

"చాలా మారిపోయావు సుమా!" వెండితీగల్లా మెరుస్తున్న ముంగురులను చూస్తూ అన్నాడు. అతనికి వెనకటి రోజులు జ్ఞాపకం వచ్చాయి.

"నువ్వు మాత్రం...." అత నిలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న వార్ధక్య చిహ్నాలు చూస్తూ అందామె.

"బాగున్నావా?"

"ఆఁ....నీవెలా వున్నావ్?"

"నాకేం...?" ప్రసాదరావు సమాధానంలో నిరాశా, నిస్పృహ తొంగిచూసాయి.

"అయితే యింకా నామీద కోపం పోలేదన్నమాట!"

"శాంతీ!" దెబ్బ తిన్నట్లు చూసాడు- "నీమీద కోపం తెచ్చు కోగలనని ఎలా వూహించావు?"

"మరి....?"

"నామీద నాకే కోపం - కాదు అసహ్యం."

"ఏం తప్పు చేసావని?"

"ఆనాడు సౌందర్య దాహం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. యుక్తా యుక్తాలకు దూరం చేసింది. ఫలి తంగా అందరి దృష్టిలోనూ చులక నయ్యాను."

"ప్రసాద్! గతాన్ని మరచి పోలేవా?" దీనంగా అడిగింది.

"శాంతీ! గతం అందరికీ తీపి గురుతులనే మిగల్చదు. కొందరికి చేదుగా కూడా వుంటుంది. చేదుకు భయపడి గతాన్ని నెమరువేసుకోక పోవటం పిరికితనమే అవుతుంది."

"..........."

"ఆరోజు నీ చేత అలా తిరస్కరించబడిన నాకు లోకం శూన్యం అనిపించింది. అక్కడ వుండటానికి మనస్కరించలేదు. కనపడిన రైలెక్కేసాను. ఎటూ అనాధనే గనుక నా గురించి విచారించేవారే లేకపోయారు."

"ప్రసాద్....!" శాంతాదేవి గొంతులో జీర స్పష్టంగా వినిపించింది. ఆశ్చర్యంగా చూసాడు ప్రసాదరావు.

"ఆరోజు నా తిరస్కారం మాత్రమే నీకు వినిపించటం, దాని వెనుకవున్న ఆరాటం,ఆవేదనా కనుపించకపోవటం నా దురదృష్టం."

"శాంతీ!"

"మావాళ్ళు నాకు కలిగినింటి సంబంధం చేయాలని తలపెట్టేరు. కానీ నేనంతగా సుముఖత చూపించలేదు. 'ముందు చదువు పూర్తి కానీయండి' అని వంక పెట్టేను."

"కారణం....?" ఆతృతగా అడిగాడు.

"పాతిక సంవత్సరాల లోతున పాతిపెట్టిన ఆ కారణం ఇప్పుడు చెప్పినా ప్రయోజనం లేదు ప్రసాద్!"

"తరువాత?"

"మావాళ్ళకు చూఛాయగా నీ గురించి తెలిసింది. తగాదా పడితే పరువు బజారు పాలవుతుందనుకున్నారు. చివరకు నిన్నీ లోకానికే దూరం చేయాలనుకున్నారు."

"మనిషిని అంతం చేయటమన్నది అంత తేలికైన విషయమా?"

"ఏమో! నాకాక్షణంలో అంతా అయోమయంగా తోచింది. నిష్కారణంగా వేరొకరి జీవితం నేలపాలు చేయటం అన్యాయమని మా వాళ్ళను బ్రతిమలాడేను. ఫలితంగా నిర్ణయాన్ని నాకే విడిచిపెట్టేరు. నా నోటితోనే చెప్పాలని పట్టుపట్టారు. ప్రసాద్ నన్ను క్షమిస్తావా?" ఆమె కళ్ళలో నీరు తిరిగింది.

పాతిక సంవత్సరాల తరువాత కూడా కన్నీటిని వుబికించిన ఆనాటి సంఘటన ఎంత బలవత్తరమైనదో ప్రసాదరావుకి అర్థమైంది.

"పిచ్చి శాంతీ! తరువాత మాత్రం నా జీవితం సవ్యంగా, సక్రమంగా సాగిపోతుందని ఎలా అనుకున్నావ్?"

"కాలం చాలా బలమైనది

ప్రసాద్! ఎంతటి గాయాన్నయినా కట్టుకట్టి నయం చేస్తుంది."

క్షణకాలం విశ్రాంతి తరువాత ప్రసాదరావే నోరు విప్పేడు—

"శాంతీ! ఒక నిజం చెపుతావా?"

"ఏమిటది?"

"నిజంగా నీవు నన్ను ప్రేమించావా?"

"..........."

"చెప్పు శాంతీ? ఇద్దరం జీవన సంధ్యలో ప్రవేశించాము. ఎవరి వలన ఎవరికీ ఎలాంటి ఆపదా రాదు. కాని ఆనాటి నా సందేహం అలాగే వుండిపోయింది. దానికి సమాధానం కావాలి?"

"ప్రసాద్!...." నేలచూపులు చూస్తూ అంది.

"నిజం కాకపోతే అబద్ధం చెప్పు. తీయగా వుండేలా చెప్పు. నిజానికి ఆనాడే శాంతికీ మనశ్శాంతికీ దూరమయ్యాను. నేటివరకూ అశాంతిలోనే అలమటించాను. మిగిలిన ఈ కొద్దికాలమైనా 'శాంతి నాదే' అన్న ధైర్యంతో బ్రతికేటట్టు చెప్పు - ప్లీజ్!"

ఎవరో వచ్చారు.

"నాన్నా! ఇక్కడున్నారా? రైలొచ్చేసింది. మీకోసం స్టేషనంతా వెతికాను. పదండి చోటు చూసుకోవాలి."

"మా అమ్మాయి శాంతి!" అమ్మాయిని శాంతాదేవికి పరిచయం చేశాడు ప్రసాదరావు.

పేరు విని తృప్తిపడింది శాంతాదేవి. కళ్ళల్లో నీరు తిరిగింది.

శాంతి, శాంతాదేవికి వినయంగా నమస్కారం చేసింది.

"అమ్మా! ఇక్కడున్నావా? ట్రెయిను దిగి నీకోసం స్టేషనంతా గాలించాను. వీరు...." అంటూ ఆగిపోయాడు అప్పుడే వచ్చిన ఓ యువకుడు.

"మా అబ్బాయి - ప్రసాద్!" ప్రసాదరావుకు పరిచయం చేసింది.

ప్రసాదరావు ముఖంలో అనిర్వచనీయమైన వెలుగు, అంతకు మించిన తృప్తి.

రైలు కూత వేసింది.

"నాన్నా" ఆతృతపడింది శాంతి.

"పదమ్మా! నిజం ఇంత అందంగా పెరిగి పెద్దదౌతుందని వూహించలేకపోయాను. నా చోటు కనుక్కోవటానికి పాతిక సంవత్సరాలు పట్టింది."

ఆ మాటలకు అర్థం తెలియని శాంతి, ప్రసాద్‌లు తెల్లబోయారు. శాంతాదేవి మౌనంగా కళ్ళు తుడుచుకుంది.

హెచ్చరికగా రైలు మళ్ళీ కూత వేసింది. *